అన్నదాతకు ఆర్థిక చేయూత

- రైతుల ఖాతాలో ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- పంటల సాగుకు ప్రభుత్వం భరోసా
- ఆనందంలో అన్నదాతలు

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు వివరాలు

మండలం	పంట	రైతులు	నగదు(రూ.లక్షల్లో)
భోగాపురం	వరి	32	2.494
డెంకాడ	వరి	410	17.461
నెల్లిమర్ల	వరి	3	0.236
పూసపాటిరేగ	వరి	110	5.309

పూసపాటిరేగ: బ్యాంకు ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు జమకావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు కష్టాల పాలయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఇనపుట్ సబ్సిడీ కింద నష్టపరిహారం అందించింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో రైతులు పంట నష్టాల నుంచి గట్టెక్కారు. గత ప్రభుత్వంలో పంట నష్టపోయిన రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటనష్ట పరిహారం పొందేందుకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సకాలంలో అవసరమైన ఆర్థిక సాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సాహిస్తోంది.



పూసపాటిరేగలో వర్షాభావ పరిస్థితి కారణంగా దెబ్బతిన్న వరిపంట(ఫైల్)

పెట్టుబడి సాయం అందింది

రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఎంతోగానో ఉపయోగపడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగు పనులు మొదలు పెట్టాం. పంట మదుపులకు డబ్బుల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని ఖాతాల్లో జమ చేయడంతో అప్పుల బాధ తప్పింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ముందుంది.

– గుజ్జు సురేస్‌రెడ్డి, రైతు, కుమిలి

రైతులకు అండగా ప్రభుత్వం

గత ఐదేళ్లగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. పంటసాగకు పెట్టుబడి కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా చేసింది. గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయినా, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వాలు పట్టించుకొనేవి కావు. నేడు రైతుకు ఎటువంటి నష్టం జరిగినా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకుంటోంది.

– కె.వెంకటరావు, రైతు, పూసపాటిరేగ

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

విజయనగరం టౌన్: ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న నిరుపేదకు 'మేమున్నాం' స్వచ్ఛంద సంస్థ ఆపన్న హస్తం అందించింది. విజయనగరం పట్టణానికి చెందిన గంటి భాస్కరనాగశర్మ పుట్టుకతో మూగవాడు. ఆయన తండ్రి కేటరింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నాగశర్మ తలకు తీవ్రగాయమైంది. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం అందించాలని దాతలను కోరారు. మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్పందించి రూ.18వేలు ఆర్థిక సాయం అందజేశారు. మానవతా దృక్పథంతో మరింత మంది దాతలు ముందుకువచ్చి నాగశర్మ వైద్యానికి సాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డోకి చంద్రశేఖర్, కె.సత్యనారాయణమూర్తి, సూరిబాబు, డి.శ్రీనివాస్, డి.భవ్య తదితరులు పాల్గొన్నారు.



నాగశర్మకు ఆర్థికసాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

విద్యా సదస్సును విజయవంతం చేయండి

నెల్లిమర్ల: ఈ నెల 27న యూటీఎఫ్ ఆధ్వర్యంలో విజయనగరంలో నిర్వహించే విద్యా సదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ కోరారు. ఈ మేరకు ఎంఈఓ–1 సూర్యనారాయణమూర్తి, ఎంఈఓ–2 విజయ్‌కుమార్‌కు యూటీఎఫ్ నెల్లిమర్ల మండల శాఖ తరఫున శనివారం కరపత్రాలు అందజేసి సదస్సుకు ఆహ్వానం పలికారు. విజయనగరంలో కె.ఎల్.పురం వద్ద నిర్మాణంలో ఉన్న శేషగిరి విజ్ఞాన కేంద్రం ఆవరణంలో నిర్వహించే ఈ సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సులో కామ్రేడ్ శేషగిరి సేవలపై శాసనమండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం స్మారకోపన్యాసం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ, సహాధ్యక్షుడు వంగపండు సురేష్‌బాబు, ఎమ్మార్సీ సిబ్బంది భారతి, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పదం అలవర్చుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శశికళ

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పదం కలిగి ఉండాలని యూటీఎఫ్ నాయకురాలు శశికళ అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ నిర్మల ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణానగర్‌లో వేసవి వినోద, విజ్ఞాన కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శశికళ మాట్లాడుతూ.. మూఢ విశ్వాసాలు విడనాడాలని, వాస్తవాలు గెలుసుకోవాలని అన్నారు. సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పిల్లలకు క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జగదాంబ, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



కోట్ల జగదీష్ (ఫైల్)

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో అద్దెకు ఉంటున్న 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ ఎస్. బాలసూర్యారావు చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు విజయనగరం జిల్లా మల్లిచర్ల గ్రామానికి చెందిన కోట్ల జగదీష్ (23)గా గుర్తించారు. జగదీష్ పెదముషిడివాడ గ్రామంలో నివాసం ఉంటూ ఎస్ఈజెడ్‌లో ఈసాయి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో సీలింగ్ ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల సూర్యారావు చెప్పారు.

మొలక శాతాన్ని పరీక్షించాలి

- ఏపీ సీడ్స్ ఎం.డి పద్మ



ఏఆర్‌పేట ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్ ఎం.డి పద్మ

జామి: వరి విత్తనాల మొలకశాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని ఏపీ సీడ్స్ ఎం.డి పద్మ తెలిపారు. మండలంలోని జామి, జాగరం, ఏఆర్ పేట గ్రామాల్లో ఆర్‌బీకే కేంద్రాలను ఏడీఏ అన్నపూర్ణతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. పచ్చిరొట్ట విత్తనాలు తీసుకున్న రైతులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. రైతుభరోసా కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఏఏలు గీత, అలేఖ్య, ఉషా, అజీజ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్సై

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. వెదుళ్లవలసకు చెందిన నెమ్మాది సురేష్ ఈ నెల 24వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో తప్పిపోయాడంటూ బాలుడి తండ్రి నెమ్మాది రామారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై దామోదరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విచారణ చేపట్టి బాలుడ్ని విశాఖపట్నంలో పట్టుకుని కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించారు.

సేవల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

జామి: వైద్యసేవలు, ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని డీఎంహెచ్ఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని అలమండ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు, వైద్య సేవలపై వైద్యాధికారి కె.వి.ఎస్.పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వారీగా సిబ్బంది అందించిన మాతా,శిశుసంరక్షణ సేవలపై ఆరా తీశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో నమోదు చేసి, వారికి అందించే సేవల వివరాలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాశన, మండప ఆవాహన తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి సన్నిధిలో అధిక సంఖ్యలో భక్తులు వ్రతాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు 5వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సా యంత్రం రమాసత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య

- విద్యాహక్కు చట్టం మేరకు పేద పిల్లలకు 25 శాతం సీట్ల కేటాయింపు
- నియోజకవర్గంలో సుమారు 400 మంది విద్యార్థులకు లబ్ధి



విద్యార్థులు

విజయనగరం రూరల్: విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టం 12(1)(సి) అమలులో భాగంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టింది. దరఖాస్తు మొదలు ఎంపిక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో చేపట్టింది. దీంతో విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటివరకు 339 మంది పేద విద్యార్థులను ఎంపిక చేశారు.

విప్లవాత్మక మార్పులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఒకటో తరగతి నుంచే ఇంగ్లీష్ మీడియంలో బోధన, కంప్యూటర్ విద్య, మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, బైజూస్ కంటెంట్‌తో విద్యాబోధన, తదితర ఎన్నో విధానాలను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మరోవైపు విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కచ్చితంగా పేద విద్యార్థులకు ఇవ్వాలనే నిబంధనను అమలు చేయడంతో మరింత మంది పేద విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

మొదటి విడతలో 339 మంది ఎంపిక

సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్, ఐబీ, ఐసీఎస్ఈలు అమలవుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఇందు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. విజయనగరం నియోజకవర్గం పరిధిలో 127 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో ప్రవేశాల కోసం సుమారు 2 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో 339 మందిని ఎంపిక చేశారు.

సీట్లు కేటాయింపు ఇలా..

ప్రతీ ప్రైవేటు పాఠశాలల్లో యజమాన్యాలు ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీలకు 6 శాతం, అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం చొప్పున మొత్తం 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుంది. ప్రవేశాలు కోరే పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలని నిర్దేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.6,500లు, పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రాష్ట్రంలో అమ్మఒడి పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం ఏటా రూ.15 వేలు చెల్లిస్తుండటంతో ప్రైవేటు పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బుతోనే ఫీజు చెల్లించి, మిగా మొత్తాన్ని విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల ఖాతాల్లో జమ చేస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించింది.

తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రతీ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ఎంపికైన విద్యార్థులను చేర్చుకోమని చెప్పినా, ప్రవేశాలు తిరస్కరించినా, ఫీజులు చెల్లించాలని వేధించినా నిబంధనల మేరకు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.సత్యవతి, ఎంఈఓ–2, విజయనగరం

భవిత కేంద్రాల్లో చేర్పించండి



రోళ్లవాక గ్రామంలో సర్వే చేస్తున్న ఎంఈఓలుచ భవిత కేంద్రం ఉపాధ్యాయులు

బొండపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓలు శోభారాణి, అల్లు వెంకటరమణ సూచించారు. మండలంలోని రోళ్లవాక గ్రామంలో శనివారం ఇంటింటా సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ముగ్గురిని గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ భవిత కేంద్రం ఉపాధ్యాయులు వెళ్లి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారిని భవిత కేంద్రంలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

శృంగవరపుకోట: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించవచ్చని, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చని, దీనికి ప్రజాసహకారం అవసరమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి(డీఎంహెచ్ఓ) ఎస్.భాస్కరరావు అన్నారు. దోమల నివారణకు జిల్లా వైద్యారోగ్యశాఖ నేతృత్వంలో మండలంలోని కాపుసోంపురం గ్రామంలో శనివారం చేపట్టిన మొదటి విడత ఏసీఎం 5శాతం ద్రావణం మందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.పలువురు గ్రామస్తులతో మాట్లాడి దోమలను నివారించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని వారికి వివరించారు. నివాసపరిసరాలతో పాటు ఇంట్లోని ప్రతీ గదిలో ఏసీఎం 5 శాతం ద్రావణం స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నివాస పరిసరాల్లో నీటి నిల్వ, తాగిపడేసిన కొబ్బరి బొండాల చిప్పలు, ఖాళీ టైర్లు లేకుండా చూసు కోవాలని ప్రజలకు సూచించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట కొట్టాం వైద్య సిబ్బంది ఉన్నారు.



కాపుసోంపురంలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

నేడు రెడ్డిపేటలో వైద్య శిబిరం

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన వైద్యురాలు కాపరోతు శ్రీవేణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సాధారణ వైద్యశిబిరం ప్రారంభమవుతుందని, వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు వంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆశయ యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటల కుశిబిరం ప్రారంభమవుతుందని, యువత రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

గంట్యాడ: వరి, పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమపేర్లను రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)ల్లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని ఏడీఏ నాగభూషణం సూచించారు. మండలంలోని పెదవేమలి, సిరిపురం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో నిల్వచేసిన వరి విత్తనాలను శనివారం ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆర్బీకేల్లో ప్రస్తుతం ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు అందుబాటు లో ఉన్నాయని, సోనామసూరి, సాంబమసూరి రకం విత్తనాలను త్వరలో సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే ఆర్బీకేల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారులు అన్నపూర్ణ, శ్యామ్‌కుమార్, వీఏఏ ప్రమీల తదితరులు ఉన్నారు.



పెదవేమలి ఆర్బీకేలో విత్తన నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగభూషణం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వేపాడ: శింగరాయి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్



కొత్తవలస: మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎస్.చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాల యంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, అలాగే ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అదే వాతావరణం కొనసాగే లా ప్రజలంతా సహకరించాలని కోరారు. తగాదాలకు దిగకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించా లని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాల్లో సభలు,సమావేశాలు నిర్వహించకూడదని, ఫలితాలు రోజున బాణసంచా కాల్చడం, ఊరేగింపులు వంటివి చేయరాదన్నారు. ఎస్ఐ సుదర్శన్ పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి

దత్తిరాజేరు: యువత తగాదాలకు దూరంగా ఉండాలని, రాజకీయాల పేరిట అనవసరంగా తగదాలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్. భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్న కుమార్ సూచించారు. ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషనల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, ఆరోజు ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయకతప్పదని హెచ్చరించారు. తగాదాలకు పాలపడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నా రు.కౌంటింగ్‌కు ముందు రోజు పోలీస్ బృందాలు గ్రామాలను సందర్శిస్తాయని తెలిపారు.

ర్యాలీలకు అనుమతి లేదు

వేపాడ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్4న వెలువడనున్నాయని, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అన్నారు. మండలంలోని శింగరాయి గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఇంకా అమలులోనే ఉందని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ రాజీవ్, పెద్దలు కండిపల్లి అమ్మతల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖమాస పూజలు



జామి: భీమసింగిలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



గజపతినగరం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న సమరసత సేవా సంస్థ సభ్యులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలో వేణుగోపాలస్వామికి ఊంజల్ సేవ చేస్తున్న పురోహితులు సతీష్‌స్వామి

గజపతినగరం: వైశాఖ మాసం సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేయించారు.

భీమసింగిలో..

జామి: మండలంలోని భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో అలంకరించారు. భీమసింగితో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మాదాయశాఖ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. పురోహితులు ఐ.వి.సతీష్‌స్వామి నేతృత్వంలో వారం రోజులుగా ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవ, పుష్పాంజలి,ద్వాదశ తిరువారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపాలంకరణ చేశారు.